
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.



కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక జూలై 23న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2024-25లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఓర్వకల్లు పారిశ్రామిక వైభవానికి పెద్దపీట వేశారు. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీని అభివృద్ధి చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. శనివారం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో నవ్యాంధ్రకు తీపి కబురు అందించారు. అయితే జిల్లాకు ప్రత్యేకంగా కేటాయింపులు లేవు. దీంతో జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు. రాజకీయ నాయకులు నిర్మలమ్మ బడ్జెట్‌పై భిన్నాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు ఇది సామాన్యుల బడ్జెట్ అంటే వామపక్ష నాయకులు అంకెల గారడి చేశారని అంటున్నారు. రూ.12 లక్షల వరకు పన్ను రాయితీ లేకుండా చేయడంతో వేతన జీవులకు మాత్రం భారీ ఊరట కల్పించారని అంటున్నారు. జిల్లాలో ఏకైక కేంద్ర విద్యా సంస్థ ట్రిపుల్ ఐటీడీఎంకు సాధారణ కేటాయింపులతోపాటు అదనపు నిధులు వచ్చే అవకాశం ఉంది. రైల్వే ప్రాజెక్టులకు ఏ మేరకు కేటాయింపులు ఉన్నదీ తెలుసుకోవాలంటే రెండు మూడు రోజులు ఆగాల్సిందే.

వేతన జీవులకు ఊరట..!

- రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు
- కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి పెంపుతో రైతులకు ప్రయోజనం
- జిల్లాలకు ప్రత్యక్ష ప్రయోజనం లేదు
- ట్రిపుల్ ఐటీడీఎంకు ఆశాజనంగా నిధులు
- పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కర్నూలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏకైక కేంద్ర విద్యా సంస్థ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానిఫాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీడీఎం), రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా ఏర్పాటు చేశారు. విస్తరణలో భాగంగా డ్రోన్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్స్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ల్యాబ్, మెకానికల్ ల్యాబ్.. వంటి వాటికి రూ.52 కోట్లు, ఈ విద్యా సంస్థ నిర్వహణ, ఉద్యోగుల జీతాలకు రూ.26.49 కోట్లు కలిపి రూ.78.49 కోట్లు అవసరం ఉందని ప్రతిపాదన పంపారు. గతేడాది రూ.35 కోట్లు వరకు ఇచ్చారు. ఐఐటీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంటే ఈ బడ్జెట్‌లో విద్యా సంస్థ నిర్వహణ, జీతాలకు రూ.26.49 కోట్లతో మౌలిక వసతులు, విస్తరణ కోసం అడిగిన రూ.52 కోట్లు కూడా ఉన్నత సాంకేతిక విద్యా గ్రాంట్ కింద వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అలాగే కర్నూలు రూరల్ మండలం పంచలింగాల సమీపంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ మిడ్-లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్ షాప్ (ఎంఎల్ఆర్) పరిశ్రమను ఈ ఏడాది డిసెంబరు ఆఖరులోగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పనులు పూర్తి కావాలంటే మరో రూ.200 కోట్లు అవసరం ఉంది. రైల్వేశాఖకు కేటాయించిన బడ్జెట్ ప్రాజెక్టుల వారీగా రైల్వే శాఖ కేటాయించాల్సి ఉంది.

కేంద్ర బడ్జెట్-2025-26లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు తీపికబురు చెప్పారు. రూ.12 లక్షల వరకు ఎలాంటి పన్నులు చెల్లించకుండా రిబేట్ ప్రకటించారు. పన్ను స్లాబులు మార్చారు. రూ.75 వేలు స్టాండర్డ్ డిడక్షన్ చెల్లిస్తే రూ.12.75 లక్షల వరకు పన్ను ఉండదని అంటున్నారు. జిల్లాలో వివిధ శాఖల్లో దాదాపుగా 45 వేల మందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 60 శాతం మంది పన్నులు చెల్లించేవారున్నారు. అదే

ఉద్యోగులకు శుభవార్త చెప్పిన నిర్మలమ్మ

క్రమంలో వివిధ వ్యాపారాలు చేస్తూ ఆదాయ పన్ను పరిధిలోకి వస్తున్న మధ్య తరగతి ప్రజలు లక్ష కుటుంబాల వరకు ఉంటాయని అంచనా. దేశ వ్యాప్తంగా వైద్య విద్యా సీట్లు పెంచుతామని నిర్మలమ్మ ప్రకటించారు. జిల్లాలో ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా సీట్లు అందుబాటులోకి వస్తాయని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీల కూడా పీజీ సీట్లు పెరగవచ్చని అంటున్నారు.

ఏపీపై కరుణ చూపారు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నవ్యాంధ్ర అభివృద్ధికి పెద్దపీట వేశారు. పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించి న్యాయం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయాలనే కుట్ర జరిగితే.. సీఎం చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకోవడమే కాకుండా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నష్టాలు పూడ్చేందుకు ప్రధాని మోదీని ఒప్పించారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.3,295 కోట్లు కేటాయించడం అభినందనీయం.

- పి.తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

మధ్య తరగతి ప్రజలకు వరం



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులకు శుభవార్త చెప్పారు. రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం అభినందనీయం. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు పలుమార్లు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిశారు. జల్‌జీవన్ మిషన్ గడువు ముగుస్తుండడంతో గడువు పెంచాలని కోరారు. బడ్జెట్‌లో 2028 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొనడం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేసేందుకు అవకాశం ఏర్పడింది. పన్ను మినహాయింపు పెంచడం వల్ల నిరుద్యోగులు చిన్నచిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకొచ్చేందుకు అవకాశం ఉంది.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

రైతుకు భరోసా ఇచ్చే బడ్జెట్



మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ రూపకల్పన చేశారు. రైతులు, మహిళలు, యువత సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారు. కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం వల్ల భూమిని నమ్ముకున్న రైతులకు తక్కువ వడ్డీకే బ్యాంకుల్లో పంట రుణాలు లభిస్తాయి.

- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ

ప్రజా సంక్షేమ బడ్జెట్



ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధిని ప్రతిబింబించే బడ్జెట్ ఇది. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో వికసిత్ భారత్, ఏపీ ప్రగతిపథంలో ముందుకుపోతోంది. ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా కేంద్రం బడ్జెట్ ఉంది. పోలవరం ప్రాజెక్టు, విశాఖస్టీల్‌కు భారీగా నిధులు కేటాయించారు. పేద మధ్యతరగతి కుటుంబాలు, ఉద్యోగులకు రూ.12 లక్షల వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను లేకుండా ఊరట కల్పించారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ ద్వారా పట్టణాల అభివృద్ధికి లక్ష కోట్లతో నిధిని ఏర్పాటు చేయడం వల్ల మౌలిక సదుపాయల కల్పన సాధ్యమవుతుంది.

- గౌరు చరిత, పాణ్యం ఎమ్మెల్యే

అంకెల గారడిలా ఉంది



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడిగా ఉంది. బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండు సున్న చుట్టింది. సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. బీహార్, ఢిల్లీ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు కనిపిస్తోంది. ఏపీకి ప్రత్యేకంగా ఒక్క ప్రాజెక్టు కేటాయించలేదు. పంటలకు కనీస మద్దతు ధర గురించి ప్రకటన కూడా చేయకపోవడం బాధాకరం. బడ్జెట్‌లో సవరణలు చేసి ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించాలి. -బి.గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

సామాన్యుల బడ్జెట్



దేశ అభ్యున్నతిని కాక్షించి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇది. ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు న్యాయం చేసేలా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ రూపొందించారు. పార్టీలకు అతీతంగా అభినందించాలి. పేద, మధ్యతరగతి, యువత, రైతుల సంక్షేమాన్ని కాక్షించే బడ్జెట్ ఇది. రాష్ట్రంలో పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించారు. రైతులకు ప్రయోజకరంగా ఉంది. స్వనిధి పథకం ద్వారా రాష్ట్రం, జిల్లాలో వీధి వ్యాపారులకు ఆర్థిక లబ్ధి కలుగుతుంది.

- అక్కమ్మతోట రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కర్నూలును క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతాం

శాప్ చైర్మన్ రవినాయుడు



ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రవినాయుడు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కర్నూలు జిల్లాలో మెరుగైన క్రీడా వసతులు కల్పించడంతో పాటు కర్నూలు జిల్లాను క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఎంపీ నాగరాజుతో కలిసి కర్నూలు డీఎస్ఏ స్టేడియంను శనివారం సందర్శించారు. ముందుగా డీఎస్ఏ ముఖద్వారం వద్ద ఉన్న హాకీ మాంత్రికుడు పద్మశ్రీ మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి వారు పూలమాలలు వేశారు. అనంతరం డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంతో పాటు జిమ్నాస్టిక్ ట్రైనింగ్ ఇండోర్ హాలును సంయుక్తంగా పరిశీలించారు. డీఎస్ఏలో విధుల నిర్వహణ అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్య నిర్వహణ, క్రీడావసతుల కల్పనపై డీఎస్ఏ అధికారులతో చైర్మన్ ఆరా తీశారు. అస్తవ్యస్తంగా ఉన్న డీఎస్ఏ నిర్వహణ పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అలసత్వంగా వ్యవహరిస్తున్న డీఎస్‌డీవో భూపతిరావు, డీఎస్ఏ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలులో అత్యుత్తమ క్రీడావసతులను కల్పించి కర్నూలు స్టేడియాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ క్రీడా పోటీలు జరిగినా అక్కడ ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి క్రీడాకారులు ఉంటారని తెలిపారు. కర్నూలులో క్రీడాకారులకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కర్నూలులో క్రీడల అభివృద్ధికి మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటు నాగరాజు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. స్టేడియంల నిర్మాణాలకు జోహరాపురం, వాటర్‌ఫాల్స్ వద్ద రెండు స్థలాలను గర్తించామని, వాటికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి త్వరలో మంత్రుల సాయంతో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమానికి ముందు పలువురు క్రీడాకారులు, క్రీడా సంఘాల నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులు శాప్ చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

- వైసీపీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైసీపీ కర్నూలు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాలులో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గం కష్ట పడి పని చేయాలన్నారు. చివరగా జిల్లా నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, నగర మేయర్ బీవై. రామయ్య, ఎమ్మెల్సీ మధుసూధన్, పత్తికొండ మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర..!



- పెట్రోల్ బంకుల్లో అందని సేవలు
- కనీస వసతులు కల్పించని యజమానులు
- ఊసేలేని అధికారుల తనిఖీలు

వివరాలు 8వ పేజీలో

కందుల కొనుగోళ్లు ప్రారంభం

- దళారులను నమ్మి నష్టపోవద్దు
- కర్నూలు డీసీఎంఎస్ అధికారి రాజు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో కర్నూలు, కల్లూరు మండలాల రైతులు కందుల విక్రయానికి తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వం క్వింటం కందులకు రూ.7,550కు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడంతో మార్క్‌ఫెడ్ సంస్థ వారం కింద డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా రైతుల నుంచి కందుల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. దీంతో రైతులు శనివారం కర్నూలు మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ కేంద్రంలో కందుల విక్రయం వివరాలు అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ అధికారులు రాజు, సంతోష్, విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందుల ధర క్వింటానికి రూ.7,200 మాత్రమే లభిస్తోందని, దీని వల్ల రైతులు నష్టపోతున్నారని, వారి పరిస్థితిని గుర్తించి కేంద్ర సంస్థ నాఫెడ్ రైతుల నుంచి కొనుగోలు వెంటనే ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు.

నిలిచిపోయిన పత్తి కొనుగోళ్లు

- లబోదిబోమంటున్న రైతులు



పెంచికలపాడులో మూతపడిన సీసీఐ కేంద్రం

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులు ముగింపు పలికారు. రైతులకు ఏ మాత్రం ముందస్తు సమాచారం ఇవ్వకుండానే పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం కేంద్రాలుగా సీసీఐ గత సంవత్సరం నవంబరు నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభించింది. క్వింటానికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.7521ను రైతులకు చెల్లించింది. అయితే.. చెప్పాపెట్టకుండా కొనుగోళ్లను నిలిపివేయడంతో రైతులకు మరోదారి లేక దళారులను ఆశ్రయిస్తున్నారు. ఆదోనిలో ఇప్పటి దాకా రూ.7,240 మంది రైతులు 1,70,655.3 క్వింటాళ్ల పత్తిని ఆ కేంద్రంలో రైతుల నుంచి సీసీఐ అధికారులు కొనుగోలు చేశారు. వారికి రూ.126.31 కోట్లు చెల్లించారు. అదే విధంగా ఎమ్మిగనూరులో 4,975 మంది రైతుల నుంచి 98,498.30 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి రూ.72.16 కోట్లు చెల్లించారు. కోడుమూరు మార్కెట్ యార్డు పరిధిలోని పెంచికలపాడు సీసీఐ కేంద్రంలో 2,633 మంది రైతుల నుంచి 83,712.58 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి రూ.61.37 కోట్లు చెల్లించినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. మంత్రాలయంలో 2,320 మంది రైతుల నుంచి 52,008.39 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి రూ.38.05 కోట్లు చెల్లించారు. మొత్తం ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీసీఐ అధికారులు 17,168 మంది రైతుల నుంచి 404874.6 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి రూ.297.91 కోట్లు చెల్లించినట్లు ఏడీఎం తెలిపారు. ఆదోనిలో గత నెల 21న ఉన్నట్లుండి రైతులకు ఏ సమాచారం ఇవ్వకుండా సీసీఐ అధికారులు కొనుగోళ్లను నిలిపివేశారు. అదే విధంగా ఎమ్మిగనూరులో 11వ తేదీన, కోడుమూరులో జనవరి 11న కొనుగోళ్లు చేశారు. మంత్రాలయంలో నవంబరు 11న మొదలు పెట్టి రైతుల ఒత్తిడితో ఆ కేంద్రంలో జనవరి 11 వరకు కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఒక్కో ఎకరాకు దాదాపు 8 నుంచి 10 క్వింటాళ్ల దాకా పత్తి దిగుబడి రైతుకు అందడంతో కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర సీసీఐ ద్వారా లభిస్తుందని, అప్పులన్నీ తీరిపోయి కష్టాల నుంచి బయటపడుతాయని రైతులు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. అయితే.. సీసీఐ కొనుగోళ్లు నవంబరు 11న ప్రారంభించి చెప్పాపెట్టకుండా జనవరి 11నాటికి మూసివేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరో రెండు నెలలపాటు సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- చిన్న నేరాలు అదుపు చేస్తే.. పెద్ద నేరాలు తగ్గుతాయి
- ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు
- ఎక్కడైనా సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వాలి
- నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. కర్నూలు ఎస్పీగా విక్రాంత్ పాటిల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఏఆర్ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం డీపీవో కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నూలు జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటామని, సైబర్ నేరాలు ఛేదించడంతో పాటు ఆ నేరాలు జరగకుండానే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామని చెప్పారు. డిజిటల్ అరెస్టు, ఆధార్ కార్డు నెంబరుతో మోసాలు, క్రెడిట్‌కార్డు లిమిట్ పెంచుతామనే సైబర్ మోసాల పట్ల ప్రజలు పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామ పేర్కొన్నారు. సైబర్ మోసాల గురించి చిన్న చిన్న వీడియో క్లిప్పింగుల ద్వారా కళాశాల, పాఠశాలల అధ్యాపకులు, మహిళా పోలీసులు, మీడియా ద్వారా సైబర్ నేరాల నివారణకు, ఫోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. అలాగే ప్రతి గ్రామంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న చిన్న నేరాలను మొదట్లోనే అదుపు చేస్తే పెద్ద నేరాలు జరగకుండా ఉంటాయని ఎస్పీ తెలిపారు. ఏ చిన్నపాటి సంఘటన జరిగినా కేసులు ఛేదించడంలో, నిందితులను గుర్తించడంలో కీలకంగా పని చేస్తాయన్నారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహిం పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు.

నూతన ఎస్పీ నేపథ్యం

- విక్రాంత్ పాటిల్ 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. తమిళనాడు రాష్ట్రం కేడర్‌కు ఎంపికైన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయ్యారు.
- 2016లో తుళ్లూరులో ఏఎస్పీగా, 2017లో పార్వతీపురం ఓఎస్డీగా పని చేసి ఎస్పీగా పదోన్నతి పొందారు.
- 2018లో చిత్తూరు జిల్లా ఎస్పీగా, ఆ తర్వాత 2019లో విశాఖపట్నం డీసీపీగా, గుంతకల్లు రైల్వే ఎస్పీగా, విజయవాడ డీసీపీగా, 2021లో విజయనగరం 5వ ఏపీఎస్పీ బెటాలియన్, 2023లో పార్వతీపురం మన్యం ఎస్పీగా పని చేశారు.
- 2024 ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కాకినాడ కమాండెంట్‌గా, ఆ తర్వాత కాకినాడ జిల్లా ఎస్పీగా పని చేసి ప్రస్తుతం బదిలీపై కర్నూలు జిల్లాకు వచ్చారు.

ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు హుశేన్‌పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో సిబ్బంది నూతన జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నిబంధనలకు పాతర..!



మూతపడిన ఎయిర్ ఫిల్లింగ్ యంత్రం

- పెట్రోల్ బంకుల్లో అందని సేవలు
- కనీస వసతులు కల్పించని యజమానులు
- ఊసేలేని అధికారుల తనిఖీలు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెట్రోల్ బంకుల నిర్వహణలో మోసాలు పేట్రేగిపోతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రమాణాలు కూడా పాటించడం లేదు. ఉచిత సేవలు కూడా అందించడం లేదు. తనిఖీలు చేయాల్సిన అధికారులు వాటిపై కన్నెత్తి చూడడం లేదు. జిల్లాలో పెట్రల్ బంకుల నిర్వాహకులు వినియోగదారులను అడ్డగోలుగా దోచుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జిల్లా కేంద్రమైన కర్నూలుతో పాటు కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో వివిధ చమురు సంస్థలకు చెందిన పెట్రోల్ బంకులు 360 ఉన్నాయి. వీటిలో 90 శాతం బంకులలో కనీస వసతులు లేవు. ఎయిర్ ఫిల్లింగ్ పాయింట్లు అలంకారప్రాయంగా మారాయి. మరుగుదొడ్లు, తాగునీరు ప్రథమ చికిత్స కిట్లు తదితర సదుపాయాలు కొన్ని చోట్ల నామమాత్రంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల సదుపాయాలు అసలే లేవు. వీటి ఏర్పాటుకు పెట్రోలియం కంపెనీలే నిధులు సమకూర్చుతున్నప్పటికీ 90 శాతం వాటిలో అలాంటివేమీ కనిపించడం లేదు. కొన్ని చోట్ల తక్కువ ఇంధనం నింపుతూ గుట్టు చప్పుడు కాకుండా దోచేస్తున్నారనే బహిరంగంగా ఆరోపణలు ఉన్నాయి.

తాగునీటికి ఇబ్బందులు

పెట్రోల్ బంకులలో వినియోగదారులకు కచ్చితంగా తాగునీటి సౌకర్యం కల్పించాలి. జిల్లాలోని పలు బంకులలో దాహం వేస్తే తాగడానికి నీటి సదుపాయం కల్పించడం లేదని విమర్శలు ఉన్నాయి. వాహనచోదకులతోపాటు సాధారణ ప్రజలు సైతం పెట్రోల్‌లో మరుగుదొడ్లు వినియోగించుకోవచ్చు. జిల్లాలోని అనేక బంకుల్లో ఇవి ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. కొన్ని చోట్ల తాళాలు వేసి సిబ్బంది మాత్రమే వాడుకుంటున్నారు.

నిబంధనల ప్రకారం నిర్వహణ ఉండాలి



నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల నిర్వహణ ఉండాలి. అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు. పెట్రోల్, డీజిల్‌లు నాణ్యత లోపం, నిబంధనలను పాటించడం లేదని ఎవరన్నా మా దృష్టికి తీసుకువస్తే వెంటనే తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తాం.

-రఘువీరా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

సాంద్రతలో వ్యత్యాసం

పెట్రోల్, డీజిల్ సాంద్రతలో వ్యత్యాసాలు అనేక పెట్రోల్ బంకుల్లో కనిపిస్తున్నాయి. డెన్సిటీ వివరాలు తెలియజేసే మీటర్లు పని చేయడం లేదు. మరికొన్ని చోట్ల అసలు డెన్సిటీ మీటర్లు లేవు. సాంద్రత పెట్రోల్‌కు 720-775 కేజీ/ఎం3, డీజిల్‌కు 82-860కేజీ/ఎం3 ఉండాలి. వ్యత్యాసం ఉంటే నాణ్యత లోపం లేనట్టే. వీటిని జిల్లాలోని పలు బంకుల్లో కొలవడం లేదు.

ధూమపానం, సెల్ వినియోగం నిషేధం

బంకులలో ధూమపానం, సెల్ వినియోగం నిషేధం. చాలా మంది వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ తమ తమ వాహనాలకు పెట్రోల్, డిజిల్ పోయించుకుంటున్నారు. ఇది అగ్ని ప్రమాదాలకు దారి తీస్తుంది. జిల్లాలోని పలుచోట్ల బంకుల్లో అగ్నిమాపక పరికరాలు కనిపించడం లేదు. మరికొన్ని చోట్ల ఇసుక బకెట్లతో సరిపెడుతున్నారు.

దిష్టిబొమ్మలా ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలు

పెట్రోల్ బంకుల్లోని ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. వాహనదారుడు పెట్రోల్ నింపుకున్న అనంతరం గాలి కోసం నిమిత్తమై ఎయిర్ ఫిల్లింగ్ యంత్రం దగ్గరకు వెళితే పని చేయడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. మరికొందరు వాహనదారులు యంత్రాలు పని చేయకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

రీడింగ్ మోసాలు

వాహనాలకు పెట్రోల్ లేదా డీజిల్ నింపేటప్పుడు బంకులో తిరిగే మీటర్ రూపాయలు ఐదుకు మించి జంప్ కాకూడదు. అంతకుమించితే మోసం చేసినట్లే. జిల్లాలోని అనేక బంకుల్లో మీటర్లలో వ్యత్యాసం అధికంగా ఉంది. ఫలితంగా రీడింగ్ మోసాలతో వాహనచోదకులు నష్టపోతున్నారు.

లిట్మస్ పేపరుతో పరిశీలించాలి

పెట్రోల్ నాణ్యతపై వినియోగదారులకు సందేహాలు ఉంటే లిట్మస్ పేపరుతో పరీక్ష చేసి చూపాలి. అలా పరిక్షిస్తే నలుసులు, దుమ్ము కనిపించకూడదు. జిల్లాలో అనేక చోట్ల సిబ్బందికి లిట్మస్ పరీక్ష గురించి తెలియకపోవడం గమనార్హం.


తనిఖీలు శూన్యం

పెట్రోల్ బంకులలో అక్రమాలు జరుగుతున్నా తనిఖీ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలతో తూతూ మంత్రంగా తనిఖీలు చేసి ఆ ఫొటోలు అంతర్జాలంలో నమోదు చేసి చేతులు దులుపుకోవడం మినహా చేసేదేమీ లేదని ఆరోపణలు ఉన్నాయి.



తుంగభద్ర తీరం

సాహిత్యం



ఒక దార్శనికుడి ఆత్మకథ

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'భారతీయ యువత ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఒక దార్శనిక స్పష్టత లేకపోవడం. ఒక దిశా నిర్దేశం లేకపోవడం. ఆ సందర్భంగానే నేను నా జీవితాన్ని తీర్చిదిద్దిన మహనీయుల గురించి, పరిస్థితుల గురించి రాయాలనుకున్నాను. అంతేతప్ప ఈ సందర్భంగా కొందరికి నివాళి ఇవ్వడానికి గానీ, లేదా నా జీవితాన్ని ఎత్తి చూపుకోవడానికి గానీ కాదు' అంటారు 'ఒక విజేత ఆత్మకథ' పుస్తకంలో మాజీ భారత రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం. ఆయన తన ఆత్మకథగా రాసుకున్న 'ది వింగ్స్ ఆఫ్ ఫైర్' తెలుగులో 'ఒక విజేత ఆత్మకథ' రూపంలో వచ్చింది. 2002లో ప్రథమ ముద్రణగా వచ్చిన ఈ పుస్తకం 2016లోనే 15వ ముద్రణగా విడుదలైంది. ఇప్పుడు ఆ సంఖ్య దాటి ఉండవచ్చు. ది వింగ్స్ ఆఫ్ ఫైర్‌కు ప్రముఖ కథా, నవలా రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు తెలుగు అనువాదం చేశారు.

కలాం జీవితం...యువతకు స్ఫూర్తిదాయకం

ఆవుల్ పకీర్ జైనులాబ్దాన్ అబ్దుల్ కలాం భారతీయ సంస్కృతిలో ఉన్నత విలువలకు సజీవ ప్రతీకగా నిలుస్తారు. ఆయన 1931లో తమిళనాడులోని రామేశ్వరంలో సామాన్య కుటుంబంలో జన్మించారు. 'కలలు కనండి...వాటిని సాకారం చేసుకునే దిశగా కృషి చేయండి' అని యువతకు ఉద్బోధించిన కలాం రక్షణ శాస్త్రవేత్తగా అద్వితీయ సేవలు అందించారు. దేశరక్షణ, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమం ప్రధాన బాధ్యతగా కలాం అత్యంత క్రియాశీలమైన ఆవిష్కరణలకు దారి తీశారు. జవ సత్వాలు ఉడిగినట్టుగా భావించబడిన పరిశోధనా సంస్థలకు ఆయన ప్రాణం పోశారు. అనామక గ్రామీణ బాల్యం నుంచి ఆయన తన వ్యక్తిగత, వృత్తిపరమైన పోరాటాలలో విజయపథం వైపు ఏవిధంగా నడిచారో చిత్రించే కథ ఇది. నేడు దేశంలో ప్రతి ఇంటా వినిపించే అగ్ని, పృథ్వి, ఆకాశ్, త్రిశూల్, నాగ్ వంటి క్షిపణుల కథ కూడా ఇది. ఒక జాతి అంతర్జాతీయ స్థాయి క్షిపణి శక్తిగా రూపొందిన కథ కూడా ఇదే. ఈ పుస్తకాన్ని భారత రత్న కలాం అరుణ్ తివారితో కలిసి రాశారు. తివారి కూడా హైదరాబాదులోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబరేటరీలో ఒక దశాబ్దం పైగా కలాం నేతృత్వంలో పనిచేశారు. ఈ పుస్తకంలో కలాం ఒక చోట ఇలా అంటారు.. 'తమని తాము మలుచుకోవడానికి నా జీవితం ఎవరికన్నా ఆదర్శప్రాయమనేటంత ఆలోచన నాకు లేదు. కానీ ఎక్కడన్నా ఒక బీద విద్యార్థి ఏ మారుమూలనో ఒక నిర్భాగ్య సామాజిక స్థితిలో ఉంటున్నవా డెవడైనా ఈ కథ చదివి ఎంతో కొంత ఓదార్పు పొందుతాడని నా ఆశ. అటువంటి పిల్లలు తమ మిథ్యాత్మక దాస్యం నుంచీ, బంధనాల నుంచీ విడివడటానికి నా జీవితయాత్రా కథనం ఏమేరకో సహకరి స్తుందని నమ్ముతున్నాను' అని అంటారు. ఇది మహోన్నత విజ్ఞాన వంతుడైన ఆయనలోని నిరాడంబరతకు అక్షర సత్యంగా నిలుస్తుంది. ప్రతి విద్యార్థి, యువత తప్పనిసరిగా చదవాల్సిన ఈ పుస్తకం వివిధ భాషల్లోనూ అనువాదం అయింది. ఎమెస్కో ప్రచురణ కర్తలుగా ఉన్న ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో లభిస్తుంది.

ఆగిన బిల్వ స్వరం

ప్రముఖ పౌరాణిక నటుడు బీసీ కృష్ణ కన్నుమూత



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీసీ కృష్ణ అంటే బిల్వ మంగళుడు. చింతామణిలోని ఈ కీలక పాత్రకు రక్తమాంసాల ప్రతిరూపంగా ఆయన సుప్రసిద్ధుడు. కర్నూలు బిల్వమంగళుడిగా జిల్లా నాటకరంగానికి అపారమైన కీర్తి గడించి పెట్టిన బీసీ కృష్ణ(80) శనివారం సాయంత్రం కర్నూలు నగరంలో కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన చికిత్సలు తీసుకుంటూ, కోలుకోలేక తుదిశ్వాస విడిచారు. కర్నూలు నాటక రంగానికి రాష్ట్రస్థాయిలో ఖ్యాతి తీసుకువచ్చిన ప్రముఖుల్లో ఒకరిగా ఆయన కీర్తి రంగస్థలం మీద శాశ్వతంగా విరాజిల్లుతూనే ఉంటుంది. నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన చింతామణి నాటకంలో బిల్వ మంగళుడిగా వేలాది ప్రదర్శనలు ఇచ్చిన ఏకైక కళాకారుడు. ప్రముఖ హార్మోనిస్టు కేసీ శివారెడ్డి రూపొందించిన ఒక ఆణిముత్యంగా బీసీ కృష్ణ నిలిచిపోతారు. అప్పటి వరకు మంచి గాత్రంతో ఘంటసాలను మరపించే గాయకుడిగా పేరు తెచ్చుకుంటున్న బీసీ కృష్ణ ప్రతిభను కేసీ శివారెడ్డి చూసి పద్య నాటక రంగానికి ఆయనకు బాటలు పరిచారు. వాచకం, నటనా కౌశలం, అభినయ చాతుర్యాలను గుర్తించి కేవలం బీసీ కృష్ణ కోసమే పరమహంస నాట్య కళా సమితిని స్థాపించి, ఆనాటి విఖ్యాత నటులు కేవీ రాఘవరావు, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి వారిని కర్నూలుకు పిలిపించి, వారికి కర్నూలులో నివాసం కల్పించి బీసీ కృష్ణకు శిక్షణ ఇప్పించారు. అలా పద్య నాటక రంగంలో ఆరంగ్రేటం చేసిన బీసీ కృష్ణ మొదట సత్య హరిశ్చంద్రలో హరిశ్చంద్రునిగా, శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణునిగా నటించారు. అయితే చింతామణి నాటకంలో బిల్వ మంగళుని పాత్ర ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టింది. బీసీ కృష్ణ నెలలో 30 రోజులు చింతామణి నాటకం ఎక్కడో ఒకచోట ప్రదర్శనలు జరిగాయి.

పురస్కారాలు ఎన్నో..

బీసీ కృష్ణకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నుంచి ఉత్తమ నటుడుగా పురస్కారం అందుకున్నారు. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేతుల మీదుగా ఈ పురస్కారం ఆయన స్వీకరించారు. అలాగే టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కందుకూరి పురస్కారం కూడా ఆయనకు లభించింది. అలాగే ఎన్నో కళాపరిషత్తుల పోటీలకు ఆయన న్యాయ నిర్ణేతగా వెళ్లి సత్కారాలు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో గొప్ప కళాకారునిగా గుర్తింపు పొందిన బీసీ కృష్ణ మృతి కళారంగానికి తీరని లోటని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యవర్గ సభ్యులు కొనియాడారు. బీసీ కృష్ణ కుటుంబ సభ్యులకు వారు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. రాష్ట్రం ఒక గొప్ప రంగస్థల కళాకారుడిని కోల్పోయిందని టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి కొనియాడారు. బీసీ కృష్ణ పార్థివ దేహానికి చౌదరితోపాటు పలువురు కళాకారులు నివాళులు అర్పించారు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

జీవితంలో ధ్యానం భాగం కావాలి

మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ధ్యానం జీవితంలో భాగం కావాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం రాత్రి నగరంలోని గాంధీనగర్‌లో గల ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో భగవంతుని ప్రదర్శన శాలలను ఆయన ప్రారంభించారు. ఈ ప్రదర్శన శాలలో విగ్రహాల కోసం టీజీవీ సంస్థల తరపున రూ.5 లక్షలు గతంలో విరాళం ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ మానసిక శారీరక ఆరోగ్యానికి ధ్యానం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేసేందుకు తగిన సమయం కేటాయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ బ్రహ్మకుమారీలు, బ్రహ్మకుమారులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం మీద దుమ్మెత్తి పోయడం తగదు

మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి



మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో చిత్తశుద్ధి చూపని ప్రభుత్వం ప్రతిపక్షం మీద దుమ్మెత్తి పోస్తోందని, ఇది తగదని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి విమర్శించారు. శనివారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మాండమైన మెజార్టీ వచ్చిన కూటమి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట కలిగించే అంశాలు ఉండటం సంతోషకరమని అన్నారు. కేంద్రంలో ఏపీ నుంచి 16 మంది ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి ఏం సాధించారని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ నాయకుల దాడి

సి.బెళగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో టీడీపీ వర్గీయులతో వైసీపీ నాయకులు ఘర్షణ పడ్డారు. శుక్రవారం రాత్రి వడ్డె చిన్న వెంకటేశ్ ఆటో తీసుకుని వస్తుండగా గ్రామంలో రోడ్డుపై పెండ్లి మెరవణి నిలబడి ఉంది. వెంకటేశ్‌కు దారి ఇవ్వకపోవడంతో మాటమాట పెరిగి ఘర్షణ పడ్డారు. వడ్డె చిన్న వెంకటేశ్ అలియాస్ గూనోడు, వడ్డె వెంకటేశ్ అలియస్ లిక్కొడుపై వైసీపీ నాయకులు కుక్కల తిమ్మన్న, మేకల రాముడు, నరసిముడు, రాముడు దాడి చేశారు. ఇందులో ఇరువురికి తలలకు బలమైన గాయాలయ్యాయని, ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. కర్నూలు డిఎస్పీ బాబుప్రసాద్, కోడుమూరు సీఐ తబ్రేజ్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి ఘర్షణలు తగవని చెప్పారు. గొడవలు పెట్టుకున్న వారిపై రౌడీ షీటర్లుగా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఆయన వెంట కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ తిమ్మారెడ్డి, గూడూరు ఎస్ఐ తిమ్మయ్య ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

పగిడ్యాల, ఫిబ్రవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ (43) శనివారం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన స్వాములు, లక్ష్మీదేవి కూలీ పనులతో పాటు స్వాములు ట్రాక్టర్ డ్రైవరుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొంత కాలంగా లక్ష్మీదేవి మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ గేటు వద్ద జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల వివరాలివీ.. నంద్యాల శివారు ప్రాంతంలోని నందమూరినగర్‌కు చెందిన గౌస్‌కు రోజాకుంట వీధికిచెందిన హరికి గతంలో నుంచే పాత తగాదాలున్నాయి. శనివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ గేటువద్ద వీరిద్దరు పరస్పరం ఎదురుపడటంతో పాత విషయాల గురించి మాట్లాడుకుంటూ వీరి మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో హరిపై గౌస్ కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో హరి గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రానైట్ లారీల పట్టివేత

నందికొట్కూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించకుండా అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న రెండు లారీలను సేల్స్ ట్యాక్స్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో మైనింగ్ అధికారులు తనిఖీ చేశారు. బాపట్ల, చీమకుర్తి నుంచి రాజస్థాన్‌కు మాచర్ల మీదుగా గ్రానైట్ లారీలు వెళ్లాల్సి ఉంది. అయితే అక్కడి నుంచి చెక్‌పోస్టుల్లో తనిఖీలు ఉంటాయని భావించి దోర్నాల, ఆత్మకూరు నందికొట్కూరు, కర్నూలు మీదుగా 150 కిలో మీటర్లు ఎక్కువైనా హైదరాబాదు మీదుగా వెళ్తున్నారు. అది కూడా 3.35 టన్నులు అధిక బరువుతో లారీలు ఉన్నాయి. ఇంత బరువుతో ఘాట్‌రూట్‌లో వాహనాలు వెళ్లకూడదన్న నిషేధం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేకపోగా, ఒకే లారీకి మూడు నెంబరు ప్లేట్లు ఉండడాన్ని గమనించారు. నెంబరు ప్లేట్లు మారుస్తూ అక్రమంగా రాజస్థాన్‌కు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ తనిఖీల్లో మైనింగ్ విజిలెన్స్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ గాయత్రి, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ రమణయ్య పాల్గొన్నారు.

యూట్యూబర్ అరెస్టు

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పలువురు రాజకీయ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రమణను త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలులోని ఎ.క్యాంపునకు చెందిన యూట్యూబర్ రమణ ఇటీవల సోషల్ మీడియా వేదికగా పలువురిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో కొంత మంది త్రీటౌన్, వన్‌టౌన్, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని రమణను అరెస్టు చేయగా జడ్జి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శేషయ్య తెలిపారు.

మహా కుంభాభిషేకం ఆరంభం

ఉరుకుంద స్వామి సన్నిధిలో మొదలైన పూజలు



యాగశాలలో హోమాలు చేస్తున్న దృశ్యం

కౌతాళం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో 3రోజుల పాటు జరిగే మహా కుంభాభిషేక కార్యక్రమాలు శనివారం మొదలయ్యాయి. మొదటి రోజు దేవాలయంలో శైవాగమ శాస్త్ర ప్రవీణ ద్విసహస్రాధిక ప్రతిష్టాచార్య అల్లవరపు సుబ్రమణ్య దీక్షితావధాని వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మంగళవాయిద్యాలతో యాగశాల ప్రదక్షిణం, భూతబలి, అఖండ దీపారాధన, దీక్షాధారణ, త్రిశూలపూజ చేసి, మంగళహారతులు ఇచ్చారు. ఆలయ అధికారి డీసీ విజయరాజు, అర్చకులు ఈరప్ప స్వామి, మహాదేవ స్వామి, శివన్న స్వామి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో కౌతాళం సీఐ అశోక్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


కమ్మరి జగదీష్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కమ్మరి జగదీష్‌కు తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ప్రొఫెసర్. సిహెచ్. చెంగయ్య పర్యవేక్షణలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో మోడలింగ్ అండ్ ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ సోలార్ పవర్ ఎలక్ట్రిల్ వెహికల్ చార్జింగ్ అనే అంశంపైన పరిశోధన చేసినందుకుగాను పీహెచ్‌డీ ప్రదానం చేశారు. కమ్మరి జగదీష్‌కు డాక్టరేట్ పట్టా పొందడంపై కళాశాల సహాధ్యాపకులు,మిత్రులు, బంధువులు అభినందనలు తెలియజేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సుధీర్

గూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సుధీర్ అన్నారు. శనివారం గూడూరులోని జిల్లా పరిషత్ బాలురు పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లింగస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు రజని, రాజశేఖరప్ప, రవికుమార్, మురళిగౌడు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోకుల షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

సి. బెళగల్. ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోకుల షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాణెమ్మ రైతులకు ఆదేశించారు. శనివారం మండలంలోని ముడుమాల, ఇనగండ్ల చింతమానుపల్లె గ్రామాల్లోని గోకులషెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలకు మంజూరైన గోకులు షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఉపాధి కూలీలు దూరప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఉన్న గ్రామాల్లోనే ఉండి ఉపాధి పనులను ఉపయోగించుకోవాలన్నారు. ఎంపీడీవో వెంట ఈసీ రంగస్వామి, ఏపీవో రామన్న, రైతులు ఉన్నారు.

రవీంద్ర విద్యార్థులకు రాష్ట్ర స్థాయి బహుమతులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర పాఠశాల విద్యార్థులకు విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో ఐడియా థాన్ 2క25 పేరుతో నిర్వహించిన పోటీల్లో కర్నూలు రవీంద్ర బాలికల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి టాప్ టెన్‌లో నిలిచారు. పాఠశాలకు చెందిన హఫీఫా, సమీరా, లిఖిత విద్యార్థినులు డ్యూయల్ పర్పస్ వీల్ చైర్ స్ట్రెచర్ బెడ్ ఫర్ హాస్పిటల్స్ అనే నమూనాను తయారు చేసి ప్రదర్శన నిర్వహించారు. రవీంద్ర ఐసీ విభాగం నుంచి ఆదిత్య, స్నేహల్, గురుచరణ్ రూపొందించిన ఉమెన్ సేఫ్టీ డివైస్ ప్రాజెక్టు నమూనాకు నగదు బహుమతి పొందారు. ప్రతిభ కనబరిచి విజయాన్ని సొంతం చేసుకున్న విద్యార్థులను రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య, చైర్మన్ జీఎం మోహన్ కుమార్, అకడమిక్ అడ్వైజర్ డా.మమతా మోహన్, వైస్ చైర్మన్ వంశీధర్ అభినందించారు. ఈ విజయం సాధించడానికి సహకరించిన ఇన్‌చార్జి రమేష్ రంజిత్, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐఎస్‌ఈవో పరీక్షలో నారాయణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభివృద్ధి పాఠశాల సిబ్బంది

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ ఫర్ న్యూట్రింగ్ అకాడమిక్ పొటెన్షియల్ ఇన్ స్టూడెంట్ సంస్థ నిర్వహించిన పరీక్షలో స్థానిక మాధవనగర్ నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ మహ్మద్ అల్తాఫ్, పాఠశాల ఏజీఎం రమేష్ కుమార్ శనివారం తెలిపారు. శనివారం ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఎస్‌ఈవో పరీక్షలో కంప్యూటర్, ఇంగ్లీషు, సైన్స్, జనరల్ నాలెడ్జ్, మ్యాథ్స్ సబ్జెక్టులపై ప్రశ్నలు ప్రస్తావించగా.. 309 మందిలో 271 మంది విద్యార్థులు అర్హత సాధించి నెక్స్ లెవెల్‌కు స్థానం పొందారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఆసియా ఫిరదౌసి 5వ ర్యాంకు, కే.కౌశిక్ 7వ ర్యాంకు, నిహారిక 17, భువన డిప్ 18, రిషిత 25 ర్యాంకులను కైవసం చేసుకున్నారని తెలిపారు.

నైతిక మానవీయ విలువలపై పరీక్ష

● 529 మంది విద్యార్థులు గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన నైతిక మానవీయ విలువలు పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు మొత్తం ప్రథమ సంవత్సరం విద్యార్థులు 23262 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. ఇందులో 22,733 మంది పరీక్షకు హాజరు కాగా, 529 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 3న పర్యావరణ పరీక్ష జరుగుతుందని ఆర్‌ఐవో గురువయ్యశెట్టి తెలిపారు. విధిగా విద్యార్థులందరూ హాజరయ్యేలా ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా మడివేలు మాచి దేవ జయంతి


మడివేలు మాచి దేవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): రజక సేవా సమితి ఆధ్వర్యంలో రజకుల కుల గురువు మడివేలు మాచీ దేవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక బీ.క్యాంపులోని బీసీ భవన్‌లో రజక సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, రజక ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు వేంపెంట రాంబాబులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక ఐక్య సేవా సమితి ప్రధానకార్యదర్శి వాడాల నాగరాజు, రజక సంఘం నాయకులు గోల్డ్‌మెన్ శ్రీను, కేతూర మధు, బబుల్, నాగార్జున, రాము తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు రిడ్జ్ పాఠాల విద్యార్థిని

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రంలో ఈ 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ పోటీలకు రిడ్జ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.సహస్ర రెడ్డి అండర్-17 బాలికల విభాగంలో ఎంపికైనట్లు పాఠశాల సీఈవో గోపినాథ్, కోసీఈవో సౌమ్య గోపినాథ్ తెలిపారు. శనివారం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సహస్రరెడ్డికి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. అనంతరం పాఠశాల డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో సమానంగ అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యాయామ బృందం ఉన్నారు.


చిన్నటేకూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను పంపిణీ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


సూదిరెడ్డిపల్లెలో వృద్ధురాలకు పెన్షన్ డబ్బులు ఇస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి


పంచలింగాలలో పెన్షన్ డబ్బులు పంపిణీ చేస్తున్న ఎంపీ నాగరాజు

'ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో సామాజిక భద్రత'

కల్లూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీతో సామాజిక భద్రత కల్పిస్తోందని ఎమ్మెల్యే గౌరుచరిత పేర్కొన్నారు. శనివారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో ఆమె అవ్వాతాతలకు పింఛన్ల పంపిణీ చేపట్టారు. గౌరుచరిత మాట్లాడుతూ గత నెలలో చనిపోయిన లబ్ధిదారుల ఇంట్లో మరొకరికి నూతన పింఛన్ అందించామన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసేదిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, వాకిటి మాదేష్, ఈవీ.రమణ, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు, ఎంపిడీఓ జి.నాగోశేషాచలరెడ్డి టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చిన్నటేకూరులోని శ్రీవెంకటేశ్వర ప్రైమరీస్కూల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత వసంతపంచమి వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులకు బలపం పట్టి అక్షరాభ్యాసం చేయించారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం పసుపుల పంచాయతీ పరిధిలో ఉన్న సూదిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ డబ్బులు పంపిణీ చేశారు. అనంతరం సూదిరెడ్డిపల్లెలో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే, సర్పంచు బొగ్గుల శీలమ్మ కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘునాథ్, పీఆర్ ఏఈ ముక్తార్‌బాషా, పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు బి.వెంకట్రాముడు, బి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ డబ్బులు లబ్ధిదారులకు అందజేశారు.

కర్నూలు న్యూసిటీ: నగర పాలక సంస్థ పరిధిలో శనివారం 97.19 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అధికార యంత్రాంగం పంపిణీ చేశారు. ఆరోరానగర్‌లో నగర పాలక మేనేజర్ చిన్నరాముడు పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు నగదు అందించారు. నగరంలో 137 సచివాలయాల పరిధిలో 35,421 మంది లబ్ధిదారుల ఉండగా సాయంత్రానికి 34,423 మంది లబ్ధిదారులకు పింఛన్ల నగదును సచివాలయ సిబ్బంది అందజేశారు. దీంతో 97.19 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది.

గూడూరు: ఎన్టీఆర్ భరోసా పించన్లు పేదలకు వరం అని టీడీపీ యువ నాయకులు సృజన్, కౌన్సిలర్లు రేమట సురేష్, కోడుమూరు షాషావలి అన్నారు. శనివారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని పడకనా విధిలో పింఛన్లను పంపిణీ చేశారు.

● చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు సురేష్ అన్నారు. శనివారం మునగాల గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుంటిచేతి గోపాల్, రామచంద్రుడు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

● గూడూరు నగర పంచాయితీ పరిధిలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షులు గజేంద్రగోపాల్ నాయుడు, పౌలు, మన్సూర్ బాషా, తెలుగు శ్రీనివాసులు పింఛన్లు పంపిణీ చేశారు.

కర్నూలు అభివృద్ధికి నిరంతర కృషి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


శివదీక్ష సేవా సమితి అన్నప్రసాద కార్యక్రమంలో పూజలు చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కష్టపడుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. శనివారం నగరంలోని పాత బస్టాండులోగల శ్రీశైలం దేవస్థాన భవనం ఆవరణలో, శివదీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో శివదీక్ష స్వీకరించిన స్వాములకు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద (అన్నదానం) కార్యక్రమాన్ని టీజీ భరత్ పూజలు చేసి ప్రారంభించారు. శివ స్వాములకు ఆయన అన్న ప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో నిష్టతో దీక్ష స్వీకరించిన శివ స్వాములు దీక్ష అనంతరం కూడా అదే నిష్టను కొనసాగించాలని సూచించారు. అన్నదాన కార్యక్రమంలో తమ టీజీవీ సంస్థల తరఫున భాగమవడం అదృష్టంగా భావిస్తానని అన్నారు. గత 25 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు.

జాతీయ స్థాయి అండర్-14 క్రికెట్ ఆంధ్రా జట్టు కెప్టెన్‌గా రుత్విక్


విద్యార్థులకు ట్రోఫీని అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ దీక్షిత్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ ఆర్ పేట శ్రీ లక్ష్మీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి వై. రిత్విక్ కళ్యాణ్ జాతీయస్థాయిలో పాట్నాలో జరిగే, అండర్-14 క్రికెట్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దీక్షిత్ మాట్లాడుతూ అమలాపురంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీలో కర్నూలు జట్టు తరపున ప్రతిభను కనబరిచి 204 పరుగులు చేసి 5 వికెట్లను తీసి, జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడని తెలిపారు. ఈ కార్యక్రములో సర్వేపల్లి పాఠశాలల వ్యవస్థాపకుడు పి. శేషన్న, పాఠశాల ప్రధానోపాయురాలు అరుణశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మంచి జీవన శైలితో ఆరోగ్యం'

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో శనివారం నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని ఎఫ్‌డీపీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కుటుంబ వైద్యంలో పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ మంచి జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో ఆరోగ్యం నెలకొంటుందని అన్నారు. మద్యం, ధూమపానం, కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆహార పదార్థాల్లో ఉప్పు తక్కువగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భాస్కర్, సీహెచ్‌వో శాంత సిబ్బంది రేష్మ, జయకుమార్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి: ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో రాముడు

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులలో వందరోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల్లో నైపుణ్య శిక్షణను వినియోగించుకోవాలని ఎంపీడీవో రాముడు కోరారు. శనివారం లద్దగిరి గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు.ఎంపీడీవో మాట్లాడుతూ వందరోజులు పూర్తి చేసుకుని పది ఆపై చదువుకున్న వారికి ఉన్నతి కార్యక్రమం కింద మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ డిజైన్, పురుషులకు సెల్‌ఫోన్, ఆటోమొబైల్, డీజిల్ మెకానిక్, చిన్నతరహా పరిశ్రమ రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మూడునెలలపాటు శిక్షణలో గౌరవవేతనం కూడా అందుతుందని తెలిపారు. అనంతరం బ్యాంకు రుణంతో శాశ్వత స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు, శిక్షణ కార్యక్రమాలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో మోదీన్‌బాష, ఈసీ వెంకటేశ్, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీఏలు పురుషోత్తం, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్టా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు, జిల్ల అద్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్, మాజీ అద్యక్షుడు ఖాజీ హుశేన్, ఉపాధ్యక్షుడు రాజాసాగర్, లక్ష్మినాయక్, లక్ష్మీదేవి, రాజేష్, రఫీ పాల్గొన్నారు.



శాప్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ, క్రీడా ప్రతినిధులు రామాంజనేయులు, తదితరులు


మాజీ మంత్రి టీజీ వెంకటేశ్‌తో మాట్లాడుతున్న శాప్ చైర్మన్

క్రీడాభివృద్ధికి కృషి చేయాలి

శాప్ చైర్మన్ రవినాయుడుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు విజ్ఞప్తి



(శాప్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న విలువిద్య క్రీడా ప్రతినిధులు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కృషి చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు శాప్ చైర్మన్ రవినాయుడను కోరారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయనను పలు క్రీడా సంఘాల నాయకులు సన్మానించారు. జిల్లా తైక్వాండో జాయింట్ సెక్రటరీ టి.వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. టి.వెంకటేశ్వర్లు మాట్లడుతూ తైక్వాండోకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టి.అజయ్ ఉన్నారు.

● డీఎస్‌ఏ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు రామాంజనేయులు హర్షవర్ధన్, సురేంద్ర, నాగరత్నమయ్య, వంశీ, విజయకుమార్, చిన్న సుంకన్న, నవీన్, తైక్వాండో వెంకటేశ్, రవికుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ గిడ్డయ్య కలిసి వినతులు అందజేశారు. నగర పరిధిలో హాకీ టర్ఫ్ కోర్టు ఏర్పాటు చేయాలని, నడిచేందుకు వాకర్స్‌కు ప్రత్యేకంగా ట్రాక్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని శాప్ చైర్మన్ హామీ ఇచ్చారన్నారు.

● విలువిద్య సంఘం సభ్యుల వినతి:

డీఎస్‌ఏ స్టేడియంలో శాప్ చైర్మన్ రవినాయుడును జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి కె.నాగరత్నమయ్య కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా నుంచి ఆర్చరీలో రాష్ట్ర, జాతీయ, యూనివర్సిటీ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. మరిన్ని విజయాలు అందుకోవడానికి కోచ్, ఆర్చరి రికర్వ్ కాంపౌండ్ రౌండ్ పరికరాలు గ్రౌండ్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్చరి కోచ్ వంశీ, బాలాజి ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి సహకరించాలి

● టీజీ వెంకటేశకు శాప్ చైర్మన్ వినతి :

రాయలసీమ అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించినవిధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని క్రీడల అభివృద్ధికి సహకరించాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశకు శాప్ చైర్మన్ రవినాయుడు కోరారు. శనివారం టీజీ వెంకటేశ్‌ను ఆయన నివాసంలో శాప్ చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఏపీలోని క్రీడలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ముందుగా జిల్లాలో చేపట్టాల్సిన క్రీడల అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు టీజీ వెంకటేశ్‌కు వివరించారు. ఏదొక క్రీడను దత్తత తీసుకుని ఆ క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులనుల ప్రోత్సహించాలని కోరారు. క్రీడల ప్రోత్సాహానికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయనీ టీజీ వెంకటేశ్ హామీ ఇచ్చారు.

ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీలను సీజ్ చేయాలి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకే భవనంలో ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీ, మదర్ థెరిస్సా నర్సింగ్ కాలేజీలను నిర్వహిస్తున్నారని, వీటిని సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, అబ్దుల్లా, రాఘవేంద్ర డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ఒకే భవనంలో రెండు నర్సింగ్ కాలేజీలను నిర్వహిస్తున్న యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. డీఎంహెచ్‌వో స్పందించి విచారణను చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

కోడుమూరు, పిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో సామొల్‌పాల్ అన్నారు. స్థానిక జడ్పీ బాలిక పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా ఉపాధ్యాయ బృందం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అన్నారు. అనంతరం విద్యార్థుల క్లాసు రూంలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. చదువు విషయంలో ప్రతి విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగరాజకుమారి, ఉపాధ్యాయ బృందం నాగవేణి, క్రిష్ణవేణి, పూర్ణిమ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కారు సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

కోడుమూరు, పిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ఎక్సైజ్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్.బండ గ్రామంలో ఎక్సైజ్ సీఐ మంజుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం దాడులు చేసి భారీగా కర్నాటక మద్యంను పట్టుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ ఎల్ బండ గ్రామంలో కర్నాటక మద్యం ఉన్నట్లు సమాచారం మేరకు అక్కడికి వెళ్లి దాడులు చేయగా ఇండికా వాహనంలో 25 బాక్సుల్లో కర్నాటకకు చెందిన ఒరిజినల్ ఛాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వీటి విలువ సుమారు రూ.90వేలు ఉంటుందన్నారు. మద్యంతో పాటు కారును కూడా సీజ్ చేశామన్నారు. కర్నాటక రాష్ట్రంకు చెందిన కర్ణగౌడ్, అహమ్మద్ హుస్సేన్ అనే ఇద్దరి నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో సమగ్ర విచారణ చేపట్టి కర్నాటక మద్యం తరలింపు వెనక ఎవరి పాత్రం ఉందో గుర్తించి వాళ్లను కూడా త్వరలోనే పట్టుకొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రమోహన్, లక్ష్మీ, హెడ్‌కానిస్టేబుల్ జగన్నాథం, తిరుపాలు కానిసేటబుల్స్ జగదీశ్, సాయి, భూలక్ష్మీ, సుజాత, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

హీమోఫీలియా రోగులకు ఫిజియోథెరపీతో చికిత్స

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ చికిత్సతో హీమోఫీలియో రోగులు మెరుగైన జీవితాన్ని పొందవచ్చునని లక్ష్మీ వెంకటేశ్ ఫిజియోథెరపీ అండ్ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోని కాలేజీలో హైదరాబాదు ఇంటాస్ ఫౌండేషన్ సహకారంతో 120 మంది రోగులకు ఫిజియోథెరపీ చేశారు. అనంతరం ఇంటాస్ ఫౌండేషన్ ప్రతినిధులు ఫిజియోథెరపి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో హీమోఫీలియా చాప్టర్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.పార్థసారధి, పిల్లిగుండ్ల నాగరాజు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అన్యాయం : ఏఐటీయూసీ

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ధరల నియంత్రించే విషయంలో ఈ బడ్జెట్ ఏమాత్రం సమాంజసం కాదన్నారు. రైతులకు, కార్మికులకు, నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు.

ఈఎన్‌టీ వైద్యుల రాష్ట్ర సదస్సు

● హాజరైన ఆరు రాష్ట్రాల వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 2: (ఆంధ్రజ్యోతి): నగరంలోనీ ఎన్‌ఆర్‌పేట శ్రీసత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో 35వ హ్యాండ్స్ ఆన్ ఆసిక్యూలోప్లాస్టీ ఈఎన్‌టీ శస్త్ర చికిత్సల వర్క్‌షాపు శనివారం ప్రారంభమైంది. ఈ వర్క్ షాపునకు ఏపీ, తెలంగాణ, ఒడిసా, కేరళ, కర్నాటక, ఢిల్లీకి చెందిన కొత్త వైద్యులు పాల్గొన్నారు. నూతన వైద్యులకు హాస్పిటల్ అధినేత డాక్టర్ బిజయప్రకాష్ రెడ్డి శిక్షణా నైపుణ్యాలను నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఈఎన్‌టీ ఆపరేషన్లపై వైద్యులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

క్రీడలతో ఉద్యోగావకాశాలు

- కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే శ్యాంబాబు
- ప్రారంభమైన ప్రీమియర్ లీగ్ టి-20 క్రికెట్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా


మాట్లాడుతున్న శాప్‌చైర్మన్ రవినాయుడు

పత్తికొండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థుల్లో మానసిక స్థయిర్యం వస్తుందని కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. శనివారం పత్తికొండలో కేఈ మాదన్న స్మారక సౌత్‌జోన్ ప్రీమియర్‌లీగ్ టీ-20 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే శ్యాంబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే బౌలింగ్ చేయగా కలెక్టర్ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన పత్తికొండ ప్రాంతంలో సౌత్‌జోన్ స్థాయి క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయమని నిర్వాహకులు సుంకన్న, శ్రీనివాసులు గౌడ్‌ను అభినందించారు. ఎమ్మెల్సీ బీటీనాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లాకళ్యాణి, ఆర్డీవో భరత్‌నాయక్, నాయకులు సాంబశివారెడ్డి, బత్తిన వెంకట్రాముడు, తుగ్గలి నాగేంద్ర, మనోహర్‌చౌదరి, తిమ్మయ్యచౌదరి, రామానాయుడు, తిరుపాలు, దివాకర్‌రెడ్డి, కేఈ రుద్ర, ఫిరోజ్, బత్తిని లోక్‌నాథ్ పాల్గొన్నారు.

● మొదటిరోజు కర్నూలు, పత్తికొండ-5 టీంలు తలపడ్డాయి. కలెక్టర్ టాస్ వేయగా కర్నూలు టీం టాస్‌గెలిచి ఫీల్డింగ్ తీసుకుంది. పత్తికొండ-5 టీం 74పరుగులకు ఆలౌట్ అయ్యింది. తర్వాత బ్యాటింగ్ చేసిన కర్నూలు టీం 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది.

క్రీడాంధ్రప్రదేశ్‌గా మారుస్తాం: శాప్ చైర్మన్ రవి నాయుడు

సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మారుస్తామని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. పత్తికొండలో ఎమ్మెల్యే శ్యాంబాబు నేతృత్వంలో శనివారం సౌత్‌ఇండియా ప్రీమియర్ లీగ్ - 20 క్రికెట్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడలతో శారీరక ధృఢత్వంలోపాటు మానసిక వికాసం ఏర్పడుతుందని, క్రీడా సర్టిఫికెట్లతో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. 2003లో ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబు హైదరాబాద్ గచ్చిబౌలిలో ప్రపంచ క్రీడలను నిర్వహించారన్నారు. పత్తికొండ క్రీడామైదానం అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే శ్యాంబాబు విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మద్దికెర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రంగస్వామి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో తనిఖీ చేశారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, శిక్షణ ఇవ్వాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు రోజూ పాఠశాలకు రావాలన్నారు. హెచ్‌ఎం దేవేంద్రప్ప, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి

దేవనకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జడ్పీ పాఠశాలకు క్రీడాస్థలం ఏర్పాటు చేయాలని శాప్ చైర్మెన్ రవినాయుడును టీడీపీ, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. శనివారం దేవనకొండకు వచ్చిన ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. ఆటస్థలం లేకపోవడంతో విద్యార్థులకు క్రీడలు నిర్వహిం చడం లేదని పెద్దయ్య, మురళి, రాజాసాబ్, సుభాన్ అన్నారు. స్పందిచిన శాప్ చైర్మన్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.


వినతి పత్రం ఇస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

పనులు పూర్తి కాగానే వేతనాలు


కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ ఫక్కీరప్ప

తుగ్గలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు పూర్తవగానే వేతనాలు అందుతాయనీ ఏపీడీ ఫక్కీరప్ప అన్నారు. శనివారం అమీనాబాద్, తుగ్గలి తదితర గ్రామాల్లో ఉపాధి పనులను తనిఖీ చేసి పరిశీలించారు. కూలీలు నిబంధనల ప్రకారం పని చేస్తే రూ.300ల వేతనం అందుతుందన్నారు. పనులకు రాని వారిపేర్లను మస్టర్లలో చేరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లస్టర్ పీఏ వెంకప్ప యాదవ్, టీఏలు చంద్ర, రామాంజనేయులు, ఎఫ్‌ఏలు సతీష్ చౌదరి, బాలమద్దయ్య, సీనియర్ మేట్లు భీముడు, రమేష్, మాదేశ్, మల్లికార్జున, రామకృష్ణ ఉన్నారు.

చలో హైదరాబాదుకు తరలిరండి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న హైదరాబాదులో తలపెట్టిన వేయి గొంతుకలు, లక్ష డప్పులకు తరలిరావాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సుభాష్ చంద్ర పిలుపునిచ్చారు. శనివారం ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తిరుపాల్, రాముడు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కురువ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప కోరారు. శనివారం బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు రూ.896 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు మాట్లాడుతూ బీసీల్లో 10 కులాలకుపైగా ఉన్నాయని ప్రతి కులానికి ఒక యూనిట్ లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని కోరారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్, హనుమంతరావు, మల్లేశ్వరప్ప, సంజీవ్, బజారప్ప పాల్గొన్నారు.

ఎట్టకేలకు బండలను తొలగించారు

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం



తహసీల్దార్ సమక్షంలో బండలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆదోని రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలసందగుత్తిలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూమిలో పాతిన బండలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. సర్వే నెం.149లో 30 సెంట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు గురికావడంతో ఆంధ్రజ్యోతి దిపత్రికలో వరుసగా శుక్రవారం "పులిరాజా" పాగా, శనివారం '24గంటల్లో బండలను తొలగించాలి' శీర్షికన కథనాలను ప్రచురించింది. రెవెన్యూ, పోలీస్, సచివాలయ అధికారులు తహసీల్దార్ శివరాముడు సమక్షంలో ఎస్కావేటర్‌తో ప్రభుత్వ భూమిలో పాతిన బండలను తొలిగించారు. ఈ తొలగింపు రాత్రి 8గంటల వరకు సాగింది.

సూపర్ సిక్స్ అమలులో విఫలం

- రాష్ట్ర ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న చిప్పగిరి లక్ష్మీనారాయణ

ఆలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల అమలులో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే, చంద్రబాబు కైలాసం చూపిస్తున్నాడని ఎద్దేవా చేస్తారు కూటమి పాలన గత వైసీపీ పాలన కంటే అధ్వానంగా తయారైందన్నారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు యాభై ఏళ్లకే పించన్ తదితర హామీలను అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు అమలు చేయడంలేదన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేదని, సమయం పడుతుందని, సంక్షేమ పథకాలు అమలు చేయలేమని, ప్రజలపై పన్నుల భారం తప్పదని, సీఎం చావు కబురు చల్లగా చెప్పడాన్ని చూస్తే ఓట్టేసిన ప్రజలకు మోసం చేసినట్లే అన్నారు. హామీలు అమలు చేయడమా లేక పదవి నుంచి దిగిపోవడమా తేల్చుకోవాలని సవాల్ విసిరారు. మొలగవల్లి రామాంజి నేయులు, డేగులపాడు మంజునాథ్, కరెంటు గోవిందు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి


మంత్రి లోకేశ్‌తో మనోహర్ చౌదరి

తుగ్గలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి కోరారు. శనివారం అమరావతిలో మంత్రి లోకేశ్‌కు సమస్యలను వివరించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, హంద్రీనీవా నీటి మళ్లింపు పనులను వేగవంతం చేయాలన్నారు.టమోటా జ్యూస్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరగా ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వారు కొన్నారు.. వీరు తిరస్కరించారు..!



వేర్ హౌస్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు


సెంట్రల్ వేర్ హౌస్ వద్ద నిలిచిన కంది లారీలు

- మద్దతు ధరకు కందులు కొన్న మార్క్‌ఫెడ్
- నాణ్యత లేదని తిరస్కరించిన సీడబ్ల్యూసీ మేనేజర్
- నాలుగు రోజులుగా లారీల్లోనే కందులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కంది దిగుబడిని మార్క్‌ఫెడ్ అధికారులు రైతుల నుంచి కొనుగోలు చేయడంతో ఇంకేముంది అని రైతులు సంతోషించారు. అంతలోనే డ్యామేజీ ఉందని సీడబ్ల్యూసీ మేనేజర్ శ్రీనిధి సరుకు తీసుకునేందుకు తిరస్కరించడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. నాలుగు రోజులుగా లారీల్లోనే కంది దిగుబడులు ఉండటంతో రైతుల అవస్థలు వర్ణనాతీతం.

ఆదోని, ఆస్పరి, ఆలూరు మండలాల గ్రామాలకు చెందిన 300 మంది రైతులకు సంబంధించి 11 లారీల (350 టన్నుల) కందిని శనివారం గోడౌన్‌లోకి దించకుండా నిలిపేశారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఆరుగాళం శ్రమించి కందిని కాపాడుకుంటే నిబంధనల పేరుతో తిరస్కరించడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. జల్లెడతో తూర్పార పట్టి గ్రేడింగ్ చేసినప్పటికీ తిరస్కరించడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల దగ్గరకే వెళ్లి డీసీఎంఎస్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి కందిని సేకరించారు. అయితే తూకపు ఖర్చు, హమాలీ చార్జీలు, లారీ బాడుగను సెంట్రల్ వేరౌస్ వద్దకు వచ్చేవరకు రైతులే భరించాల్సి ఉంటుంది. దీంతో నాలుగు రోజులు లారీల బాడుగలు భరించామని, ఇప్పుడు వెనక్కి తీసుకెళ్లానడటం ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బసాపురం, దాణాపురం, మదిరే, జోహారాపురం, రామదుర్గం విరుపాపురం బేవినహాళ్ల తదితర గ్రామాలకు చెందిన రైతులు కంది దిగుబడులు తీసుకోకుంటే ఇక్కడే రోడ్డుపై పాడేస్తామని హెచ్చరించారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సెంట్రల్ వేర్‌హౌస్ మేనేజర్ శ్రీనిధితో మాట్లాడి రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదని, సరుకు తీసుకోవాలని కోరారు. ఆమె నిబంధనలు పాటించాలనడంతో సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు ఫిర్యాదు చేశారు.

నిబంధనలను సవరించాలి

గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.7550 దొరుకుతుందని ఆశించాము, గోడౌన్ మేనేజర్ నిబంధనల పేరుతో తిరస్కరిస్తున్నారు. నిబంధనలు సవరించాలి **- సుధాకర్, కంది రైతు బసాపురం**

నిబంధనల మేరకే

ప్రభుత్వ నిబంధనల మేరకే సెంట్రల్ వేర్ హౌస్ గోడౌన్‌లో నిల్వ ఉంచుతాం. డ్యామేజీ ఎక్కువగా ఉండటంతో కొనుగోలు చేయలేదు అక్కడే పూర్తిగా పరిశీలించి తీసుకురావాలి.

- శ్రీనిధి, వేర్‌హౌస్ మేనేజర్

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి


ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆశ లకడాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. శనివారం డిల్లీలో జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆశా లకడాను కలిసి విన్నవిం చినట్లు తెలిపారు. ఏపీలో 13 జిల్లాలుండగా 8 జిల్లాలో ఎస్టీలు గానూ రాయలసీమలోని 30 లక్షల మందిని మాత్రమే బీసీలుగా పరిణించడం అన్యాయమన్నారు. ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేశారని పార్లమెంట్‌లో కూడా ఆమోదించాలని కోరినట్లు తెలిపారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి


డ్రైనేజీని పరిశీలిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌళిక వసతులకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ వీరభద్ర గౌడ్ అన్నారు. శనివా రం మణేకుర్తిలో పించన్లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం పల్లె పండుగ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేయించిందన్నారు. అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్లకు ప్యాచ్‌లు వేశారన్నారు. కార్యదర్శి విజయ్ కుమార్, కన్వీనర్ అశోక్, వెంకటేష్, దేవేంద్ర, రమేష్ ,రాము యాదవ్, వస్నూరు వల్లి పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ


స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి): ఆదోని పౌర సరఫరాల గోదామును శనివారం సాయత్రం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. రేషన్ నిల్వ, భద్రత తదితర అంశా లను పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మట్లాడుతూ లబ్ధిదారులకు బియ్యం పంపిణీలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పౌర సరఫరాల డీటీ వలిభాష, రవీంద్ర రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని రూరల్ సీఐ నల్లప్ప హెచ్చరించారు. శనివారం మాట్లాడుతూ బియ్యం, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

గళం వినిపిస్తాం

ఆలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాదిగల సమస్యలపై లక్ష డప్పులతో గళం వినిపిస్తామని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆర్‌జె ప్రకాశ్ అన్నారు. శనివారం ఆలూరులో మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగనున్న లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమానికి తరలిరావాలని పిలుపు నిచ్చారు. చిప్పగిరి లక్ష్మీ నారాయణ,కత్తి రామాంజినేయులు, ఎల్లప్ప పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

తుగ్గలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీవో విశ్వమోహన్ సూచించారు. శనివారం తుగ్గలిలో మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు ఇంటింటి సర్వే చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మండలంలో 80 శాతం పూర్తి చేశారనీ, మిగిలిన 20 శాతం కూడా ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

ఆలూరు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశం మొక్కుబడిగా సాగింది. సమస్యలపై ప్రజా ప్రతినిధులు నోరు మెదకపోవడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, వెలుగు తదితర శాఖల అధికారులు తూతూ మంత్రంగా వివరించి మమ అనిపించారు. జడ్పీటీసీ సభ్యుడు ఏరూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ మహబూబ్ బాషా మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఇన్‌చార్జి ఈవోఆర్డీ ప్రభాకర్, ఏవో వెంకటేశ్వర గౌడ్ ఏపీవో శ్రీనివాసులు, ఏఈలు చౌడరెడ్డి, రామ్ లీలా, ఏపీఎం అంజనేయ పాల్గొన్నారు.

బకాయి చెల్లించని గోడౌన్ల స్వాధీనం

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో అద్దెలు చెల్లించని మూడు గోడౌన్లను పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో శనివారం కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, విజిలెన్స్ టీం సభ్యుడు కార్నాలస్ స్వాధీనం చేసుకున్నారు. కార్యదర్శి మాట్లాడుతూ రూ.20లక్షలకు పైగా బకాయిలున్నాయని, గతంలో నోటీసులు జారీ చేసినా స్పందించలేదన్నారు. కమీషన్ ఏజెంట్ లైసెన్సును పునరుద్ధరించకుండా నాలుగేళ్ల గుడుస్తున్నా అద్దె చెల్లించకుండా కొనసాగుతున్నారన్నారు. దీంతో వన్ టౌన్ ఎస్‌ఐ రామస్వామి, ఆర్‌ఐ ఖాసిం వలి, వీఆర్‌వో కిష్టప్ప సమక్షంలో పంచనామ చేసి 255, 328, 329 నెంబర్ల గోడౌన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సహాయ కార్యదర్శి శాంత కుమార్, సూపర్వైజర్లు జ్ఞానప్ప, ఆనంద్, నాగరాజు, శివ నరేష్, రాము పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, రంగారెడ్డి, దస్తగిరి కలెక్టర్‌ను కోరారు. శనివారం పత్తికొండకు వచ్చిన కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎస్.ఎస్. ట్యాంకులను ఏర్పాటు చేసి నీటితో నింపాలని కోరారు.

రాజకీయ సన్యాసం ఎప్పుడు చేస్తారు?

- మాజీ ఎమ్మెల్యేకు బీజేపీ నాయకుల సవాల్


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పిన మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాదరెడ్డి ఎప్పుడు తీసుకుంటారో చెప్పాలని బీజేపీ అధికార ప్రతినిధి విజయ కృష్ణ వైసీపీ కౌన్సిలర్లను ప్రశ్నించారు. శనివారం బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతూ, శుక్రవారం జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, నరసింహులు మహిళా కౌన్సిలర్ వెల్లాల లలితమ్మను ఏక వచనంతో సంబోధించి, సమావేశం నుంచి బయటికి పోవాలని, రాజీనామా చేయాలని దుర్భాషలాడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఆదోనిని కబ్జాల అడ్డాగా మర్చింది వైసీపీ అని, ఎమ్మెల్యే పార్థసారథి రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాలు లేకుండా చేశారని ప్రజలకు తెలుసన్నారు. రమాకాంత్, శ్రీనివాసచారి, సాయి వాల్మీకి, పర్టిలైజర్ వీరేష్, ఉషా రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పదో తరగతి కీలకం

- కలెక్టర్ రంజిత్ బాషా


కస్తూర్బాలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

పత్తికొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పదో తరగతి కీలకమని ఉత్తమ ఫలితాలు సాధించేం దుకు కృషి చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా సూచిం చారు. శనివారం పత్తికొండ బాలికల గురుకుల, కస్తూర్బా పాఠశాలలను ఎమ్మెల్యే శ్యాంబాబు, ఎమ్మెల్సీ బీటీ నాయుడితో కలసి పరిశీలించారు. పాఠాలు అర్థం కాకపోతే మరోసారి అడిగి తెలుసుకోవాలని. యూట్యూ బ్‌లో కూడా తెలయని అంశాలు నేర్చుకోవచ్చన్నారు. వర్చువల్ తరగతుల ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సైన్స్, మ్యాథ్స్ సిలబస్ ఎంతమే రకు పూర్తయిందని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు మట్లాడుతూ పదో తరగతిలో 90శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తామన్నారు. అనంతరం వంటగది, ఆహారాన్ని పరిశీలించారు. కస్తూర్బా పాఠ శాలకు నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాల కోసం స్థలాన్ని సేకరించాలని ఆర్డీవోకు సూచించారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ప్రిన్సిపాళ్లు సుబ్బలక్ష్మమ్మ, షభానా ఉన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

దేవనకొండ: మండలంలోని కరివేముల గ్రామంలో కలెక్టర్ రంజిత్ బాషా ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. కిడ్నీ బాధితులు గుజ్జం కిరణ్, గిరిధర్, దివ్యాంగుడు రాజగోపాల్, వృద్ధాప్య పించన్ రంగన్న ఇళ వద్దకు వెళ్లి వారి యోగక్షేమలు అడిగి పింఛన్లు పంపీణి చేశారు. గ్రామంలో నీటి సమస్య ఉందని, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించాలని, సచివాలయం భవనం, పాఠశాల భవనాలను పూర్తి చేయాలని, చెరువు కట్టపై కంపను తొలగించి, కాలువ నిర్మించాలని గ్రామస్థులు కోరారు. డీఆర్‌డీవో శివనాగలీల, పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, డీటీ సుదర్శనం, ఎంపీడీవో సూర్యనారాయణ, గ్రాస్తులు గిడ్డయ్య, వస్నూరప్ప, అబ్బ రంగన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించకుంటే చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఏపీవో హేమసుందర్



తుగ్గలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించకపోతే చర్యలు తప్పవని ఏపీవో హేమసుందర్ అన్నారు.

ప్రశ్న: వలసల నివారణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: గ్రామసభలు ఏర్పాటు చేసి పనులు కల్పిస్తామని దండోరా వేయిస్తున్నాం. ఉపాధి పనులు కల్పించాం.

ప్రశ్న:మండలంలో జాబ్‌కార్డులు, కూలీల వివరాలు తెలపండి?

జవాబు: 18,757 జాబ్‌కార్డులు, 34,474 మంది కూలీలు ఉండగా, 4,665 మంది పనులకు వెళ్తున్నారు.

ప్రశ్న: ప్రణాళిక సిద్ధం చేశారా?

జవాబు: ఉపాధి పనులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

ప్రశ్న: ఉపాధిలో అవినీతిని అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: రోజూ సిబ్బంది ఫొటోలు తీయడంతో పాటు హాజరు వేసేలా చర్యలు తీసుకున్నాం. అలాగే ఎంపీడీవో, ఏపీవోలు రోజుకో గ్రామానికి వెళ్లి తనిఖీ చేస్తున్నారు.

ప్రశ్న: పండ్ల తోటల పెంపకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: పండ్ల తోటలకు వంద శాతం సబ్సిడీ అందుతుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వారికి మొక్కలను కూడా సరఫరా చేస్తున్నాం. వాటి పెంపకంపై నిపుణుల చేత అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: గోకులం షెడ్ల నిర్మాణాలు ఎంత వరకు వచ్చాయి?

జవాబు: మండలానికి 72 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. పశుసంపద ఉన్న రైతులకు మంజూరు చేశాము. ఇప్పటికే 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి.

తవ్వారు .. వదిలేశారు..


రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాచాని సోమప్ప ఇంగ్లీష్ స్కూల్ పక్కనుంచి లక్ష్మీపేటకు వెళ్లే రహదారిలో డ్రైనేజీని పాఠశాల నిర్వాహకులు తవ్వి వదిలేశారు. దాంతో పెద్దపాటి గుంత ఏర్పడి సగానికి పైగా రోడ్డుపై మట్టి కుప్ప ఉండటంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాల పక్కనే గుంత ఉండటంతో అటుగా రాకపోకలు సాగించే విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తవ్విన డ్రైనేజీకి మరమ్మతులు చేసి మూసి వేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా డ్రైనేజీ

తోపుడు బండ్లను తొలగించాలి: ఎస్ఐ


తోపుడు బండ్ల వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారుల్లో తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, బండ్లను తొలగించాలని ఎస్ఐ శివాంజల్ సూచించారు. శనివారం రాఘవేంద్ర సర్కిల్ నుంచి ఎంటీఆర్ క్యాంటీన్ వరకు, ఆర్టీసీ బస్టాండు నుంచి సర్కిల్ వరకు రోడ్డుకిరువైపులా తోపుడు బండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ జామ్ అవుతోందని, తద్వారా భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రెండు రోజుల్లో తోపుడుబండ్లు తీయకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దన్నారు. తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, మల్లికార్జున స్వామి, పరమేష్, రామకృష్ణ, జమీర్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

మంత్రాలయం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రపురానికి చెందిన షణ్ముకాచారి (70) అనే మతి స్థిమితం లేని వృద్ధుడు హెలిప్యాడ్ మైదానంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మంత్రాలయం చెందిన షణ్ముకాచారిగా గుర్తించి ఆయన భార్య జయమ్మ, కూతురు రేణుకలకు సమాచారం ఇచ్చారు. గత ఏడేళ్లుగా మతిస్థిమితం లేక ఇంట్లో ఉండటం లేదని, ఎలా మృతి చెందాడో తెలియాల్సి ఉందన్నారు. దహన సంస్కారాలు చేసేందుకు కూడా తమకు స్థోమత లేదని చెప్పడంతో ఎస్ఐ శివాంజల్ స్థానిక పంచాయతీ సభ్యులతో మాట్లాడి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆలయాల్లో పూజలు


శివుడికి పూజలు చేస్తున్న పూజారి

గోనెగండ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం సందర్భంగా శనివారం ఈశ్వర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాల్లో మాఘమాసం వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గోనెగండ్లలోని నీలకంఠేశ్వరదేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

నందవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవి కాలంలో గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని నందవరం ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నకొత్తిలి తాగునీటి పథకాలను ఆయన పరిశీలించారు. వచ్చే వేసవిలో తాగునీరుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకుగాను ఎస్ఎస్ ట్యాంక్‌లను నీటితో పూర్తిగా నింపుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పూల చింత గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. పెద్దకొత్తిలో సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మూర్తి, పీఎస్ పెద్దరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్టార్టర్



పెద్దకడుబూరు , ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చుగిరి గ్రామంలో విద్యుత్ స్టాటర్ ప్రమాదకరంగా మారింది. గ్రామానికి నీటిని సరఫరా చేసే మోటారుకు అధికారులు విద్యుత్ స్టాటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే స్టార్టను విద్యుత్ స్తంభానికి కింది భాగంలో ఏర్పాటు చేయడంతో చిన్నపిల్లలు, మూగజీవులకు ప్రమాదం జరిగే పరిస్థితి లేకపోలేదు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్టాటర్‌ను మార్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వలస వెళ్లవద్దు

పెద్దకడుబూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు, రైతులు వలసలు వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి పనులకు వెళ్లాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జయరాముడు కోరారు. శనివారం మండల పరిధిలోని గంగులపాడు గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసలకు పిల్లలను తీసుకెళ్లడం వలన విద్యకు దూరమవుతారన్నారు. గ్రామంలోనే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకొని పిల్లలను చదివించుకోవాలన్నారు. రోజుకు రూ.300 వరకు కూలి వస్తుందన్నారు. కార్యక్రమంలో టీఏ రామ్మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల నమోదుపై అవగాహన ఉండాలి


పంటల నమోదును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనాథ్

పెద్దకడుబూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల నమోదుపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనాథ్, ఏవో వరప్రసాద్ అన్నారు. శనివారం పెద్దకడబూరులోని 2024- 25 రబీ సీజన్ పంటల నమోదు ప్రక్రియను తహసీల్దారు, ఏవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు, వీఆర్‌వోలు రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేస్తారన్నారు. పంటలు నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వరిస్తాయన్నారు. అలాగే పంటల నష్టపోతే పంటల బీమా వస్తుందన్నారు. అలాగే కందులు క్వింటంకు రూ 7550 చెప్పున మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్, రైల్వే లైన్ ప్రాజెక్టుల సాధనకు కృషి

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్క్‌ను సాధించి చేనేతలకు చేతినిండ పనులు కల్పిస్తామని ఎమ్మెల్యే బీవి జయనాగేశ్వర రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని నాలుగు, ఇరువైమూడు వార్డుల్లో పర్యటించారు. పలువురు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నాలుగవ వార్డులో మూప్పై ఏళ్లుగా సీసీ రోడ్డుకు నోచుకోలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సీసీ రోడ్డు మంజూరు చేసి పనులను ప్రారంభించామన్నారు. ఎమ్మిగనూరు ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్క్ కోసం గతంలో తన తండ్రి బీవి మోహన్ రెడ్డి అప్పెరల్ పార్క్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించరాన్నారు. అయితే అప్పట్లో ప్రభుత్వం మారడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అప్పెరల్ పార్కును కడపకు తరలించారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సైతం టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కోసం బనవాసిలో వంద ఎకరాలు భూమిని సేకరించామన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ టెక్స్‌టైల్ పార్కు స్థలాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చి నాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టెక్స్‌టైల్ పార్కు కోసం తిరిగి 74 ఎకరాలు కేటాయించిందన్నారు. చేనేతలకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మంత్రాలయం, కర్నూలు రైల్వే లైన్ సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతంలో డీపీఆర్ సిద్ధం చేశారని, మరోసారి ఎంపీ నాగరాజుతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. మంత్రి నారా లోకేశ్ ప్రవేశ పెట్టిన వాట్సాప్ పరిపాలన ద్వారా ప్రజలకు 161 సేవలు వారి చేతిలోనే ఉంటాయని, సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం చంద్రబాబు , మంత్రి నారా లోకేశ్ ఆలోచనతో వాట్సాప్ పరిపాలన తీసుకోచ్చారన్నారు. సమావేశంలో మున్సిపాల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు కౌన్సలర్లు రాందాస్‌గౌడ్, చంద్రమోహన్ రెడ్డి, నాయకులు రంగస్వామి గౌడ్, రామకృష్ణ నాయుడు, గుల్లా సలామ్, తురేగల్ నజీరు, లక్ష్మన్న, నవాజ్, ఇబ్రహీం, పులికంఠి, అంబేడ్కర్, షాలేము, ఈరన్న, రామకృష్ణ, బీజేపీ నాయకులు నరసింహులు, వెంకటేష్ పాల్గొన్నారు.

● పట్టణంలోని చాకలి వీధిలో వెలసిన మడివాల మాచయ్య స్వామి ఆలయంలో స్వామివారి జయంతి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేక రథంపై అధిష్టించి పట్టణ ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆలయంలో స్వామి వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సలర్ గుల్లా సలామ్, రజాక కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు


దుద్ది గ్రామంలో రాజరాజేశ్వరి దేవిని దర్శించుకుంటున్న టీడీపీ యువ నాయకుడు రామకృష్ణారెడ్డి

కోసిగి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్ది, రామలింగేశ్వర స్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం నుంచే ఆలయ ధర్మకర్త గుడిసె రామలింగప్ప ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మంత్రాలయం నాయకుడు రామకృష్ణారెడ్డి, నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, గుడిసె కృష్ణమ్మ, నాడిగేని చిన్న తాయన్న, వక్రాణి వెంకటేశ్, బసలదొడ్డి ఈరన్న హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జ్ఞానేష్, గుడిసె శ్రీరాములు, జక్కనగేని వెంకటేష్, తాయన్న, ఈరేష్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి


జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్

కోసిగి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ రుద్రగౌడు సూచించారు. శనివారం కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి సమక్షంలో తహసీల్దార్ రుద్రగౌడు, ఈవోపీఆర్డీ హరూన్ రషీద్ భోజనాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ రుద్రగౌడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కాలేజీ విద్యార్థులకు కూడా మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసిందని, నిర్వహకులు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అలాగే విద్యార్థులు జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కోసిగి వాసులకు జిల్లా పదవులు

కోసిగి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కోసిగికి చెందిన పలువురికి వైసీపీలో జిల్లా పదవులు వరించాయి. కోసిగికి చెందిన వైసీపీ నాయకుడు ఎం.జగదీష్‌స్వామి వైసీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే వైసీపీ జిల్లా కార్యదర్శిగా మురళి మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడిగా బెట్టన్నగౌడు ప్రమాణ స్వీకారం చేశారు.

సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

పెద్దకడుబూరు , ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలోని 184ఏ2డీ సర్వే నెంబర్లు గల భూమిలో కొందరికి పోజిషన్ సర్టిఫికెట్ జారీ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు నాగేష్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దారు శ్రీనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆ సర్వే నెంబర్‌లో 51మందికి ప్రభుత్వం పట్టాలు జారీ చేసిందన్నారు. అలాగే హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ భవనం నిర్మించారన్నారు. కాంపౌండ్ నిర్మిస్తుండగా కొందరు వ్యక్తులు తమకు పోజిషన్ పట్టాలు ఉన్నాయని కోర్టు వెళ్లడంతో నిర్మాణం మధ్యలో ఆగిపోయిందన్నారు. అధికారులు విచారించి పోజిషన్ సర్టిఫికెట్ రద్దు చేయాలని ఆయన కోరారు.

విద్యతోనే విద్యార్థులకు గుర్తింపు

● కోసిగిలో ఘనంగా మౌంట్ కార్మల్ యానివర్సరీ వేడుకలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

కోసిగి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని రంగప్పగట్టు సమీపంలో ఉన్న మౌంట్ కార్మల్ హై స్కూల్ యానివర్సరీ డే ఘనంగా నిర్వహించారు. ఫాదర్ తంకచన్ నజలైట్, మండల విద్యాధికారి శోభరాణి, పాఠశాల యజమాన్యం జోజి, జాన్సన్, జీజోల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథులు మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో మంచి ప్రతిభ కనబరిస్తే మంచి గుర్తింపు వస్తుందని, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలంటే బాగా చదువు కోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాడిగేని అయ్యన్న, నాడిగేని చిన్నతాయన్న, వక్రాణి వెంకటేష్, లక్ష్మిరెడ్డి, ఈరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి


కోసిగిలో మార్కండేయస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీ డా. సంజీవ కుమార్, రిటైర్డు డీఎంహెచ్‌వో నరసింహులు

కోసిగి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని పద్మశాలీయుల కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీభక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలీ సంక్షేమ సంఘం యువజన సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో వేకువ జాము నుంచే అర్చకులు వీరస్వామి, వేద పండితులు ఆదోనికి చెందిన గరుడాద్రి వెంకటసుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో మార్కండేయస్వామికి జలాభిషేకాలు, పంచామృతాభిషేకం, వెండి కవచ అలంకరణ, మహా మంగళహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలకు మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ కుమార్, రిటైర్డు డీఎంహెచ్‌వో నరసింహులు, కాంగ్రెస్ ఇన్‌చార్జి మంత్రాలయం మురళి దొర, పెద్దకడుబూరు తహసీల్దార్ శ్రీనాథ్‌లు హాజరై దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శివ పార్వతుల కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో పలువురు అతిథులను సన్మానించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దేవిబెట్టలో అంతర్రాష్ట్ర ఒంగోలు ఎద్దుల బండలాగుడు పోటీలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని దేవిబెట్ట గ్రామంలో అంతర్రాష్ట్ర ఒంగోలు ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు టీడీపీ సీనియర్ నాయకులు, పోటీల నిర్వాహకులు దేవిబెట్ట సోమేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి, నాగరాజు, బొడ్డన్న, జగదీష్, రాముడు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ గ్రామంలోని రంగస్వామి జాతరను పురస్కరించుకొని మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం ఈనెల 9న ఉదయం 8గంటల నుంచి బండలాగుడు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. నాలుగు పళ్ల సైజు ఎద్దులు పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇందులో గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండవ బహుమతి రూ.20వేలు, మూడవ బహుమతి రూ.15వేలు, నాల్గవ బహుమతి రూ. 10వేలు, ఐదవ బహుమతి రూ.8వేలు, ఆరవ బహుమతి రూ.6వేలు, ఏడవ బహుమతి రూ.5వేలు, ఎనిమిదవ బహుమతి రూ.3వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఫొటో1వైఎంజీ01,02. పట్టణంలోని నాల్గవ వార్డులో లబ్దిదారులకు పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవి జయనాగేశ్వర రెడ్డి

ఘనంగా ఫ్రెషర్స్ డే



ఇంజనీరింగ్ కళాశాలలో డాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రకోట గ్రామ సమీపంలో ఉన్న సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ న్యాయవాదులు మురళి కృష్ణ, చంద్రశేఖర్లను కళాశాల నిర్వాహకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు, క్రమ శిక్షణ అలవర్చుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇష్టంతో చదివి మంచి ఉద్యోగ అవకాశాలను పొందాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

5న కలెక్టరేట్ ఎదుట 'ఫీజు పోరు'


ఫీజు పోరు పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 5న చేపడుతున్న ఫీజు పోరుబాట నిరసన కార్యక్రమానికి తరలిరావాలని మునిసిపల్ చైర్మన్ రఘు కోఆరారు. శనివారం ఫీజు పోరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను పూర్తిగా నిలిపివేసిందన్నారు. దీంతో విద్యార్థులు ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యం తరగతులకు అనుమతించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని నిరసనగా చేపట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బుట్టా ఫౌండేషన్ నీలకంఠప్ప, శివప్రసాద్, యు.కె రాజశేఖర్, సునీల్, శివారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీకి మాజీ కౌన్సిలర్ రాజీనామా

● అదే బాటలో మరో నలుగురు?

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో వైసీపీకి వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ అరుణ, ఆమె భర్త సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డికి, సన్నిహితుడు శిరసాల రాము రాజీనామా చేశారు. పట్టణంలోని రెండవ వార్డుకు చెందిన శిరసాల రాము, మాజీ ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీలోను, అలాగే వైసీపీ పార్టీలోను కొనసాగుతూ వచ్చారు. త్వరలో కార్యకర్తలతో సమావేశమై భవిష్యత్ కార్యక్రమానికి ప్రకటించునున్నట్లు తెలిపారు. రాజీనామా యోచనలో .. మరో నలుగురు వైసీపీ కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసి యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిన ఓ అనధికార నాయకుడితో చర్చలు జరిగినట్లు తెలిసింది. తాజాగా మాజీ కౌన్సిలర్ రాజీనామా చేయటం, మరో నలుగురు రాజీనామాకు సిద్ధం కావటంతో వైసీపీకి భారీ షాక్ తగిలినట్లు అయింది.

పాఠశాలల తనిఖీ

ఎమ్మిగనూరు టౌన్,ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ పాఠశాలలను డీఈవో శ్యామూల్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాచాని సోమప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలపై ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని గుడ్‌బెస్ స్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గరాదని, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో ఉపాధ్యాయులకు సూచించారు. డీఈవో వెంట ఆదోని డీడీఈఓ, ఎంఈవో 1 అంజనేయులు, ఎంఈవో 2.మధుసూదన్ రాజులు పాల్గొన్నారు

వెండి రథంపై ప్రహ్లాదరాయలు


ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం మాఘమాసం తదియను పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పీఠాధిపతి సంస్థానపూజ చేశారు. అనంతరం వెండి రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం మంటపంలో ఊంజలసేవ నిర్వహించారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. మాఘమాసం శనివారం తదియ కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్‌లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయాధికారి

రాఘవేంద్ర స్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయాధికారి జస్టిస్ జ్యోతి ములిమణి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట తహసీల్దారు ఎస్ రవి, అనంతపురాణిక్, ఎస్ఐ శివాంజిల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్ ఉన్నారు.